క్లుప్తంగా

కొండలమ్మను దర్శించుకున్న జడ్జి



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని గన్నవరం జూనియర్ సివిల్ జడ్జి బి.శిరీష ఆదివారం దర్శించుకున్నారు. ఆమెను ఆలయ ఈఓ ఆకుల కొండలరావు దుశ్శాలువాతో గౌరవించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. తొలుత ఆమె పేరిట అమ్మవారికి వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఏఎస్ఐ సారథి, ఆలయ అర్చకుడు శివ సంతోష్ ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం టీచర్స్ కాలనీలో వరసిద్ధి వినాయకస్వామి దేవాలయ నిర్మాణానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ దంపతులు ఆదివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో టీచర్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గుంటక శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి వి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు జి. శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి వై.రామకృష్ణ, కోశాధికారి సత్యనారాయణ, సాగునీటి సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కలకోటి శ్రీనివాస రెడ్డి, పోలారెడ్డి సాంబిరెడ్డి, యర్కారెడ్డి కోటి రెడ్డి, గుంటక సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోలవరం కాలువ వద్ద ఉన్న ఆంజనేయస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా శోభాయాత్ర



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పుర వీధుల్లో ఆదివారం యోగీశ్వర్ దేవీదయాల్ జ్యోతిర్లింగ్ దేవస్థానం ఆధ్వర్యంలో శోభయాత్ర వైభవంగా జరిగింది. దేవస్థానం 22వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం కలశపూజ, పంచముఖ హనుమాన్ అభిషేకాలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం యోగీశ్వర్ రామ్‌లాల్ భగవాన్, ములఖ్‌రాజ్ భగవాన్, యోగీశ్వర్ దేవీదయాల్‌జీ సురేందర్ దేవ్‌జీ స్వరూపాలతో శోభాయాత్ర కోలాటం, భజన బృందాలతో ఆద్యాంతం వైభవంగా జరిగింది. అనంతరం అఖండ జ్యోతిని నీటిలో నిమజ్జనం చేశారు. ప్రధాన యోగాచార్య శ్రీస్వామి అమిత్ దేవ్‌జీ మహారాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు, ఆశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కొవ్వొత్తుల ప్రదర్శన



గన్నవరం: స్థానిక ఆర్సీఎం బాల ఏసు దేవాలయంలో ఆదివారం విచారణ గురువుల పసల తోమస్ నేతృత్వంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. విచారణ పరిధిలోని భక్తులు కొవ్వొత్తులను చేత పట్టుకుని ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం చర్చిలో ఫాదర్ రాకేష్, ఫాదర్ వినోద్ ఆధ్వర్యంలో దివ్య బలి పూజను సమర్పించారు. ఈ సందర్భంగా ఫాదర్ తోమస్ మాట్లాడుతూ.. క్రీస్తు బోధనలకు అనుగుణంగా ప్రతిఒక్కరు సేవాగుణం కలిగి ఉండి తోటివారికి సాయపడాలని చెప్పారు. విచారణ ఉపదేశీలు, మరియదళ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా బాల ఏసు ఊరేగింపు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక గుడివాడరోడ్డులోని జ్యోతినగర్ ఆర్సీఎం చర్చిలో అద్భుత దివ్య బాలఏసు మహోత్సవాలు మూడో రోజైన ఆదివారం ఘనంగా జరిగాయి. బాపులపాడు మండలం పెరికీడులోని సహాయమాత టవర్ నుంచి హనుమాన్‌జంక్షన్ నాలుగు రోడ్ల కూడలి వరకు బాలఏసు విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై క్రైస్తవులు ఊరేగింపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మచిలీపట్నం మేత్రాసనం డీజీఎం ఫాదర్ వల్లె జోజిబాబు, ఫాదర్ పసల తోమాస్‌లు దివ్య పూజబలి సమర్పించారు. అనంతరం భక్తులను ఉద్దేశించి దైవ సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా 'బీద లాజరు-ధనవంతుడు' అనే బైబిల్ నాటకాన్ని ప్రదర్శించారు. జ్యోతినగర్ చర్చి ఫాదర్ చేబ్రోలు జోసఫ్ తంబి, పాదర్ వినోద్, ప్యారిస్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



రాళ్లతో అధ్వానంగా ఉన్న రోడ్డు మార్గం



చెరువుకట్ట దిగుడు ప్రాంతం

రహదారి నిర్మాణానికి మోక్షమెప్పుడో..?

- నున్నలో పుల్లయ్య-జంగమవాని చెరువుల మధ్య అధ్వానంగా రోడ్డు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు



చెరువుల మధ్య ప్రమాదకరంగా ఉన్న రహదారి

విజయవాడరూరల్: నున్న గ్రామంలో ప్రధానమైన పుల్లయ్య, జంగమవాని చెరువుల మధ్య రహదారి అధ్వానంగా ఉంది. రెండు చెరువుల ఆయకట్టు పరిధిలో వందలాది ఎకరాల వ్యవసాయ భూములు ఉండటంతో ప్రతి నిత్యం రైతాంగం వ్యవసాయ పనులకు రాకపోకలు సాగిస్తుంటారు. పొలాలకు వెళ్లే రైతులు ఎరువుల బస్తాలు తీసుకెళ్లడానికి, పంటలు పండించుకున్న తర్వాత వ్యవసాయోత్పత్తులను ఇంటికి తీసుకెళ్లేందుకు గోతులమయంగా ఉన్న రహదారితో ఎన్నో అవస్థలు పడుతున్నారు. పుల్లయ్య చెరువు, జంగమవాని చెరువుల పరిధిలో 425 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. నున్న, రామచంద్రపాలెం, ముస్తాబాదు గ్రామాలను అనుసంధానం చేస్తూ ఉండే ఈ రహదారిని బీటీ రోడ్డుగా నిర్మించడానికి గతంలో ఉపాధి నిధులు రూ. 80లక్షలతో అంచనాలు సిద్ధం చేశారు. కానీ ఇంతవరకు అడుగు ముందుకు పడలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతుల అవసరాలకు ఉపయోగపడేలా ఈ రెండు చెరువుల మధ్య రోడ్డును నిర్మిస్తామని నేతలు చెప్పడం జరిగింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఈ రహదారి గురించి పాలకులు ప్రస్తావించడం లేదనే ఆరోపణలు వినబడుతున్నాయి.

చెరువుల మధ్య రోడ్డు నిర్మించాలంటూ రైతుల డిమాండ్

పంటలు పండించడానికి అవసరమైన సాగునీటితో నిండుకొని ఉంటున్న జంగమవాని, పుల్లయ్య చెరువుల మధ్యలో రహదారికి పెద్ద గొయ్యి పడి ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని రైతులు అంటున్నారు. రాత్రి సమయాల్లో వరిగడ్డి ట్రాక్టర్లు రావాలంటే ప్రమాదకరమైన ఈ మార్గంలో కష్టంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక నున్న, ముస్తాబాదు గ్రామాలకు నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు ప్రయాణం చేయడం ప్రాణ సంకటంగా ఉంది. ఈ రహదారి మార్గాన్ని నిర్మించాలని నున్న, ముస్తాబాదు, రామచంద్రపాలెం గ్రామాల రైతులు ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు. రహదారి నిర్మిస్తే ఈ ప్రాంతాల అభివృద్ధికి దోహదం చేసినట్లు అవుతుందని ఆయా గ్రామాల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు లేక ఇబ్బందులు



సాయిబాబా గుడి నుంచి ముస్తాబాదు గ్రామ పొలిమేర వరకు రోడ్డు నిర్మిస్తే రైతులకు ఎంతో ప్రయోజనం. వ్యవసాయ పనులకు నిత్యం రాకపోకలు సాగించే వారు సరైన రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మించడం ద్వారా పలు గ్రామాలకు రాకపోకలు సులువుగా ఉంటుంది.

–భీమవరపు శివశేషిరెడ్డి, నున్న గ్రామం

వెంటనే రోడ్డు నిర్మించాలి



ప్రభుత్వం రోడ్డు నిర్మాణం విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ముస్తాబాద, సూరంపల్లి, రామచంద్రపాలెం గ్రామస్తులకు ఈ రోడ్డు ప్రయోజనకరంగా ఉంటుంది. ఎన్నో ఏళ్లుగా రోడ్డు నిర్మాణం గురించి అధికారులను అడుగుతూనే ఉన్నాం.

–గుంటక హనుమారెడ్డి, నున్న గ్రామం

ఆకట్టుకున్న గర్భిణుల ర్యాంప్ వాక్



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సినీ తార పూర్ణ

రామవరప్పాడు: సంప్రదాయ, పాశ్చాత్య వస్త్రధారణలతో గర్భిణులు ర్యాంప్ వాక్ చేసి ఆకట్టుకున్నారు. విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని అను మై బేబీ 3వ వార్షికోత్సవాలను ఆదివారం వినూత్నంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీ తార పూర్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరోయిన్ పూర్ణ మాట్లాడుతూ ఈ వార్షికోత్సవ సంబరాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. నారీ శక్తికి నిదర్శనంగా ఈ కార్యక్రమం నిలుస్తోందన్నారు. అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ జి. శ్రీదేవి మాట్లాడుతూ అను మై బేబీ మూడేళ్ల ప్రస్థానంలో అనేక మైలురాళ్లను అధిగమించిందని తెలిపారు. వైద్య నిపుణులతో మంచి ప్రమాణాలతో వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ జి. రమేష్, వైద్యులు డాక్టర్ కవిత, పావని, మంజు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

8న సాయిబాబా మందిర వార్షికోత్సవం

కంకిపాడు: మండలంలోని చలివేంద్రపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం 19వ వార్షికోత్సవాలను ఈనెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు శ్రీ సాయిరామ్ తీర్థ సేవా ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. ట్రస్టు నేతృత్వంలో వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తిచేశారు. 8వ తేదీ ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భగవద్గీత పారాయణం, భక్తులకు అన్నసమారాధాన ఏర్పాటుచేశారు. పూజా కార్యక్రమాలు, వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని ట్రస్టు ప్రతినిధులు కోరారు.

'లక్షల డప్పులు-వేల గొంతులు' జయప్రదం చేయాలి



లక్షల డప్పులు-వేల గొంతులు గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

నున్న(విజయవాడరూరల్): హైదరబాద్‌లో ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన జరిగే లక్షల డప్పులు-వేల గొంతులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ ఏమ్మెస్పీ గన్నవరం నియోజకవర్గ బాధ్యుడు మందవేణు మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం నున్న గ్రామంలో లక్షల డప్పులు-వేల గొంతుల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను వెంటనే అన్ని రాష్ట్రాల్లో అమలు చేసి సుప్రీం కోర్టు తీర్పును గౌరవించాలని కోరారు. నియోజకవర్గం నుంచి ప్రతి మాదిగ కుటుంబం నుంచి డప్పు తీసుకొని వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెస్పీ విజయవాడ రూరల్ మండల ఇన్‌చార్జి చిల్లిముంత కోటేశ్వరరావు మాదిగ, గన్నవరం మండల ఇన్‌చార్జి పొరిటిగడ్డ దేవదాసు మాదిగ, నున్న గ్రామ అధ్యక్షుడు తగరం సుబ్బారావు మాదిగ, పొరిటిగడ్డ కొండ మాదిగ, జూనపూడి భీమరాజు మాదిగ పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం



దాసాంజనేయస్వామి దేవస్థానంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ దంపతులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఐటీఐ రోడ్డులోని దాసాంజనేయస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠతోపాటు విఘ్నేశ్వరస్వామి, నాగేంద్రస్వామి విగ్రహాలు, శ్రీసీతారామ, లక్ష్మణ, హనుమ ఉత్సవ విగ్రహాల ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. శతాధిక ప్రతిష్ఠాపనాచార్య కస్తూరి రాజగోపాలాచార్య ఆధ్వర్యంలో అర్చకులు మారేపల్లి శ్రీనివాసాచార్యులు విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులు హాజరై విశేష పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానాన్ని కూడా ఎమ్మెల్యే యార్లగడ్డ దంపతులు సందర్శించి పూజలు చేశారు. నాగార్జున సాగర్ ఎడమకాలువ ప్రాజెక్టు వైస్‌చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకర సుభాష్ చంద్రబోస్, మాజీ సర్పంచులు కాకాని అరుణ, వేములపల్లి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేద సంస్కృతిని పరిరక్షించుకోవాలి



వేద సభలో పాల్గొన్న పండితులు

విజయవాడ కల్చరల్: వేద సంస్కృతిని పరిరక్షించుకోవాలని వేద పండితులు చల్లా విశ్వనాథ ఘనాపాటి అన్నారు. కంచికామకోటి జగద్గురు శంకరాచార్య చతుశాస్త్ర ట్రస్ట్, విద్యారణ్య వేద విద్వత్ సభ ఆధ్వర్యంలో లబ్బీపేట శారదా చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న 46వ వార్షిక సమావేశాలు ఆదివారం ముగిసాయి. విశ్వనాథశాస్త్రి ఘనాపాటి మాట్లాడుతూ సకల శాస్త్ర సారం వేదాల్లోనే ఉన్నాయన్నారు. ఆదిశంకరులు రచించిన వేద భాష్యాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. దేవాలయం ట్రస్టీ మాగంటి వేణుగోపాల్ మాట్లాడుతూ కృష్ణామండల వేద విద్వత్ సభ ద్వారా ఏటా జాతీయస్థాయిలో వేద సభలు, వేద విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంస్కృత అధ్యాపకుడు దూళిపాళ రామకృష్ణతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేద పండితులు పాల్గొన్నారు. నిర్వాహకులు వేద పండితులను ఆత్మీయంగా సత్కరించారు.

ఇంటిగ్రేటివ్ మాన్యువల్ థెరపీపై అవగాహన



డాక్టర్ ప్రేమ్‌కుమార్‌ను సన్మానిస్తున్న వాకర్స్ సభ్యులు

పెనమలూరు: ప్రతిఒక్కరూ ఇంటిగ్రేటివ్ థెరపీపై అవగాహన కలిగి ఉండాలని ఫిజియోథెరపీ డాక్టర్ వి.ప్రేమ్‌కుమార్ సూచించారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఆదివారం ఎన్ఎస్ఎస్ యూనిట్, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. అంతర్గతంగా ఏర్పడే నొప్పుల మూలం గుర్తించి చికిత్స చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గ్లోబల్ మాన్యువల్ పరీక్షలో శరీర నిర్మాణం, మానవ శరీరానికి సంబంధించి బయో మెకానికల్ పరీక్ష చేసి నొప్పులు పరిష్కరించవచ్చని వివరించారు. అనంతరం పలువురికి చికిత్స చేశారు. ఈ సందర్భంగా వాకర్స్ సభ్యులు డాక్టర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

అబాకస్‌తో గణితంపై పట్టు



అబాకస్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో హరికృష్ణ, జనార్ధన్

రామవరప్పాడు: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే అబాకస్ నేర్చుకోవడం వల్ల గణిత పాఠ్యాంశంపై నెలకొన్న భయాలు దూరమవుతాయని విశ్వం ఎడ్యుటెక్ రీజనల్ హెడ్ కేశవ జనార్ధన్ అన్నారు. విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులోని వివేకానంద కాన్సెప్ట్ స్కూల్‌లో ఆదివారం విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో అబాకస్, వేదిక్ మ్యాథ్స్ జోనల్ స్థాయి పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలల్లోని 700 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేశవ జనార్ధన్ మాట్లాడుతూ ఈ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు ఈనెల 9వ తేదీన జరిగే స్టేట్ లెవల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. గణితమంటే విద్యార్థుల్లో నెలకొన్న భయాన్ని ఈ అబాకస్ శిక్షణతో దూరం చేయవచ్చునని చెప్పారు. సృజనాత్మక శక్తి, జ్ఞాపక శక్తి పెంపొందించేందుకు అబాకస్ దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివేకానంద పాఠశాల ప్రొప్రైటర్ బొప్పన హరికృష్ణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, గురువులు

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం 1984–85 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. పాఠశాలలో నలభై ఏళ్ల క్రితం పదవ తరగతి పూర్తి చేసిన 60 మంది పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకుని సందడి చేశారు. ఆనాటి పాఠశాల అనుభవాలను, ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులు టీఎస్ఆర్‌కే ప్రసాద్, కే జయరాజు, పీ రామానుజాచార్యులు, డీ సాంబశివరావును ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. 1984–85 బ్యాచ్ ఆత్మీయ సమావేశాన్ని ప్రతియేటా నిర్వహించేందుకు ముందుకు వచ్చిన కొల్లిపర శివప్రసాద్‌ను కూడా సన్మానించారు. ఈ సందర్భంగా టీఎస్ఆర్‌కే మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులను ఒకేచోట కలుసుకునే అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆత్మీయ విందుతో పాటు ఆటపాటలు, డ్యాన్సులతో పూర్వ విద్యార్థులు ఉల్లాసంగా గడిపారు. పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, కార్యదర్శి దామెర సీతారామయ్య, వ్యవస్థాపక అధ్యక్షుడు కస్తూరి అప్పారావు, కోశాధికారి కోనేరు రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

పెనమలూరు: మహిళ అదృశ్యమైన ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప దళితవాడకు చెందిన కొప్పుల నాగేశ్వరరావు, వాణి భార్యభర్తలు. అయితే గత నెల 19వ తేదీన వాణి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నందన 'వనం'



లిల్లీ, గులాబీ, చామంతి మొక్కలు



రకరకాల చామంతులు



ఆహ్లాదాన్ని పంచే క్రోటాన్ మొక్కలు



కాపు కాస్తున్న గోరుచిక్కుళ్లు

కంకిపాడు మండలం చలివేంద్రపాలెం గ్రామానికి చెందిన ముప్పిడి రమాదేవికి మొక్కలు అంటే చాలా ఇష్టం. ఆ ఇష్టంతోనే ఇంటి పెరట్లో వివిధ రకాల చామంతులు, లిల్లీ, గులాబీ, కూరగాయల మొక్కలను నాటారు. ఇంటి చుట్టూ ప్రహరీగోడను సైతం మొక్కల పెంపకానికి వినియోగించుకున్నారు. గోడపై నూనెడబ్బాలు, కుండీల్లో క్రోటాన్ జాతి మొక్కలతో పాటు పండ్ల మొక్కలు, ముఖ్యంగా డ్రాగన్ వంటి పోషకాలు అందించే మొక్కలు పెంచి సంరక్షిస్తున్నారు.

– కంకిపాడు



కోతకు సిద్ధంగా ఉన్న టమాటాలు



ఏపుగా ఎదిగిన వంగ మొక్కలు



తీతకు సిద్ధంగా ఉన్న ముల్లంగి

క్యాంపస్ ఎంపికలో 11 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో వైస్ ఛాన్సలర్ వెంకటేశ్వరరావు

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టుబీ యూనివర్సిటీకి చెందిన 11 మంది విద్యార్థులు రిలయన్స్ సంస్థలో ఉద్యోగాలు సాధించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్(ఈఐఈ) విభాగానికి చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించిన పలు సాంకేతిక పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసి రిలయన్స్‌లో గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ ట్రైనీ ఉద్యోగాలు సాధించారు. వీరికి వార్షిక వేతనంగా రూ. 7.5 లక్షలు ఇస్తారు. కాలేజీలో ఆదివారం వైస్‌ఛాన్సలర్ డాక్టర్ పీ వెంకటేశ్వరరావు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.